క్లుప్తంగా

పూర్తి సాంకేతికతతో పట్టాల రిజిస్ట్రేషన్లు



పదమర ఖండ్రికలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: మండలంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల పట్టాలు పొందిన వారు తన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పూర్తి సాంకేతికతతో రిజిస్ట్రేషన్ చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పదమర ఖండ్రికలో శనివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. పట్టాదారులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో మాట్లాడారు. త్వరితగతిన రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన వీడ్కోలు



సాయిసత్యనారాయణను సత్కరిస్తున్న వీఆర్వోలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది, స్థానికులు

కాజులూరు: మండల తహసీల్దార్ సాయిసత్యనారాయణకు స్థానికులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్నికల బదిలీల నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సాయిసత్యనారాయణ కాకినాడ ఏఓగా బదిలీ అయ్యారు. శనివారం వీఆర్వోలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది, స్థానికులు సాయిసత్యనారాయణను శాలువాలతో సత్కరించారు. మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ మండలంలో సుదీర్ఘకాలం పని చేసిన తహసీల్దారు సాయిసత్యనారాయణ సేవలను కొనియాడారు.

స్వామి ప్రసాద్‌కు పలువురి అభినందనలు

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా కమిటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా మండపేట మండలం ద్వారపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల పీఏస్ ఉపాధ్యాయుడు స్వామి ప్రసాద్ ఎన్నికయ్యారు. క్షేత్ర స్థాయిలో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించే లక్ష్యంతో కృషి చేస్తానని స్వామి ప్రసాద్ అన్నారు. ఆయన కృషిని జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సుబ్రహ్మణ్యం, కోర్సు డైరెక్టర్ వీర రాఘవరెడ్డి, ఫోరం నాయకులు మామిడి సత్యనారాయణ, ఇనుమర్తి ప్రసాద్, గుడ్ల పట్టాభి, చక్రవర్తుల రామానుజం, ఎ.రామకృష్ణ, గొడవర్తి శ్రీదేవి అభినందించారు.

రహదారి నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ రాజేంద్రప్రసాద్

రాయవరం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని రామచంద్రపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రాజేంద్రప్రసాద్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శనివారం రాయవరంలో ఆటో యూనియన్ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి వాహనదారుడూ తమ కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారి నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారితో పాటు, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలపై పరిమితికి మించి, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. సమావేశంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మందపల్లి కొండలరావు, ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ హంతకులను శిక్షించాలి

కపిలేశ్వరపురం: విశాఖ జిల్లాలో తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి కారకులను కఠినంగా శిక్షించాలని మండల రెవెన్యూ అధికారులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. చట్ట పరిధిలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులపై దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. అధికారులతో పాటు క్షేత్ర స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.వెంకటేశ్వరరావు, రీసర్వే డీటీ పి.శ్రీరామ్, ఆర్ఐ ఎస్.శ్రీనివాస్, 19 గ్రామాల వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



మండపేట మండలం అర్తమూరు నుంచి బయలుదేరుతున్న నాయకులు, కార్యకర్తలు



కపిలేశ్వరపురం మండలం టేకి నుంచి బయలు దేరుతున్న నాయకులు, కార్యకర్తలు



రాయవరం మండలం నుంచి సిద్ధం సభకు తరలి వెళ్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు



తాళ్లపొలంలో బస్సు ఎక్కడానికి సిద్ధంగా ఉన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

దెందులూరుకు తరలివెళ్లిన జన దళం

- ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో వేలాదిగా హాజరు
- నందడి చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- జెండా ఊపి బస్సులు ప్రారంభించిన కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

కపిలేశ్వరపురం: ఏలూరు సమీపంలోని దెందులూరులో శనివారం నిర్వహించిన దుష్టచతుష్టయంపై 'సిద్ధం' బహిరంగ సభకు మండపేట నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు దెందులూరు తరలి వెళ్లాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో మండపేట పట్టణం, మండపేట రూరల్‌లోని 12 గ్రామాలు, రావయరం మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల నుంచి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్న వారు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్ళారు. వైఎస్సార్‌సీపీ జెండాను చేత పట్టుకుని పార్టీ అధినేత పిలుపును అందుకుని ఉత్సాహంగా తరలి వెళ్ళారు. మండపేట మండలం కేశవరం, ఏడిద, ద్వారపూడి, మెర్నిపాడు, అర్తమూరు, మారేడుబాక, తాపేశ్వరం, వేములపల్లి, పాలతోడు, వెలగతోడు, ఇప్పనపాడు, జెడ్.మేడపాడు గ్రామాల్లో సమకూర్చుకున్న వాహనాల్లో తరలివెళ్ళిన వారిలో అధిక సంఖ్యలో మహిళలు కూడా ఉన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారు. దీంతో సకాలంలో జననేత ప్రసంగాన్ని వినే అవకాశం అందరికీ దక్కింది. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, ఎమ్మెల్సీ తోట తనయుడు పృథ్వీరాజ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దూలం వెంకన్నబాబు, కర్రి పాపారాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, పలు విభాగాల నాయకులు, పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు జనం తరలింపు ఏర్పాట్లును పర్యవేక్షించారు.



రామచంద్రపురంలో సిద్ధం సభకు తరలివెళుతున్న బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న సూర్యప్రకాశ్

కపిలేశ్వరపురం మండలం నుంచి..

మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు దెందులూరు సభకు తరలి వెళ్లాయి. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, 19 పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాయవరం మండలం నుంచి..

రాయవరం: ఏలూరు సమీపంలోని దెందులూరులో శనివారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 12 గ్రామాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు తరలి వెళ్లారు. నదురుబాద, వెదురుపాక, వి.సావరం, రాయవరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల నుంచి 30 బస్సుల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు.

సిద్ధం సభకు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

రామచంద్రపురం: ఏలూరు జిల్లా దెందులూరులో జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 76 గ్రామాల నుంచి బస్సులు, కార్లలో సుమారుగా 6500 మంది సభకు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ నేతృత్వంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు భారీగా తరలివెళ్లారు. వీరికి బస్సుల్లోనే భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. తిరిగి సభ ముగిసిన అనంతరం కార్యకర్తలు, నాయకులకు సూర్యప్రకాశ్ తాడేపల్లిగూడెంలో భోజనాలు ఏర్పాటు చేశారు. సభకు తరలివెళుతున్న బస్సులు కార్లతో నియోజకవర్గంలోని మండల కేంద్రాలు, పట్టణంలోని ప్రధాన రహదారి వైఎస్సార్ సీపీ జెండాలు, బస్సులతో కళకళలాడింది.



కాజులూరు మండల గ్రామాల నుంచి సిద్ధం సభకు తరలివెళుతున్న కార్యకర్తలు, ప్రజలు

కాజులూరులో..

కాజులూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం కావాలని ఎంపీపీ మాత భారతి అన్నారు. ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు కాజులూరు మండలంలోని 26 గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. జగనన్నను గెలిపించేందుకు మేము సిద్ధం అంటూ కార్యకర్తలు బస్సులపై సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గుండెల నిండా అభిమానంతో..

రామచంద్రపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల రణరంగానికి సిద్ధం.. అని ప్రకటించగానే మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు గుండెల నిండా ఉన్న అభిమానంతో మేము సైతం సిద్ధం అంటూ ఏలూరు సమీపంలోని దెందులూరుకు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ నేతృత్వంలో మండలంలోని 25 గ్రామాల నుంచి గ్రామానికి 50 నుంచి 100 మంది తరలివెళ్లారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా?

రామచంద్రపురం: ప్రభుత్వం ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నా.. కొందరు అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రజాధనం వృథా అవుతోంది. దీంతో ప్రజలకు మేలు చేకూర్చాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో నిర్మాణాల వద్ద కనీస, ఆహ్లాద వసతుల కల్పనలో కొందరు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు అర్బన్ గ్రీనరీ శాఖ నిర్వాకమే నిదర్శనమంటున్నారు. రామచంద్రపురం పట్టణంలో ఒకటో వార్డు కొత్తూరులో టిడ్కో గృహాలను ప్రభుత్వం వేగవంతంగా నిర్మించింది. తొలి విడతలో 998 మంది లబ్ధిదారులకు టిడ్కో ఫ్లాట్‌లను అందజేశారు. టిడ్కో గృహ సముదాయం వద్ద అన్ని రకాల సౌకర్యాలను కల్పించేలా ముందు నుంచీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కమ్యూనిటీ హాళ్లు, గ్రౌండ్స్, పార్కుల నిర్మాణాలకు ప్రత్యేక స్థలాలను కూడా కేటాయించింది. వీటిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అర్బన్ గ్రీనరీ శాఖకు బాధ్యతలను అప్పగించింది. సుమారు రూ.50 లక్షలతో టిడ్కో ప్రదేశంలో మొక్కల పెంపకం, పార్కుల అభివృద్ధి చేయటంతో పాటు, పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు వీలుగా జిమ్‌నూ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికోసం ఇప్పటికే జిమ్‌కు సంబంధించిన సామగ్రిని ఏడాది క్రితమే టిడ్కో గృహ సముదాయాల వద్ద అందుబాటులో ఉంచారు. ఏడాదిన్నర కాలమవుతున్నా, వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు.

పాడైపోతున్న జిమ్ సామగ్రి

పార్కుల్లో ఏర్పాటు చేయదలచిన పిల్లలు ఆడుకునే సామగ్రితో పాటు, ఓపెన్ ఎయిర్ జిమ్ సామగ్రిని అర్బన్ గ్రీనరీ శాఖ ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయం వద్ద దిగుమతి చేశారు. వీటిని పార్కుల్లో అమర్చాల్సి ఉండగా, అలాగే వదిలేశారు. స్థానికులు చాలాసార్లు మున్సిపాలిటీ అధికారులకు దీనిపై ఫిర్యాదు చేసినా, పట్టించుకున్న పాపానపోలేదు.



టిడ్కో ఫ్లాట్ల వద్ద వృథాగా పడి ఉన్న ఆట, జిమ్ సామగ్రి

తుప్పలు.. విష సర్పాలు

ఫ్లాట్లకు అనుకుని జిమ్, ఆట సామగ్రి వేయటంతో తుప్పలు విపరీతంగా పెరిగి, కీటకాలు, విష సర్పాలు చేరుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎండకు ఎండి, వానకు తడిసి రూ.లక్షల విలువైన సామగ్రి కూడా పనికి రాకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, వాటిని పార్కుల్లో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అర్బన్ గ్రీనరీ, టిడ్కో, పురపాలక శాఖలు సమన్వయంతో వ్యవహరించి, వాటిని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. దీనిపై అర్బన్ గ్రీనరీ శాఖను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులో లేరు. టిడ్కో అధికారి మాత్రం ఈ విషయం తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా, టిడ్కో, అర్బన్ గ్రీనరీ శాఖలు సంయుక్తంగా వాటిని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీనిపై పురపాలక శాఖ తరఫున వారితో సంప్రదించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా

మండపేట నూతన కమిషనర్ రాము

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని నూతన కమిషనర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన బి.రాము అన్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన టి.రామ్‌కుమార్ ధర్మవరం బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో విశాఖ నగరపాలక సంస్థ కమిషనల్ బి.రాము నియమితులయ్యారు. తొలిసారిగా కార్యాలయానికి వచ్చిన కమిషనర్ రాముకు మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు, ఆర్ఐ వంక ప్రభాకర్ చౌదరి, ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పట్టణంలోని సచివాలయాల ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.



కమిషనర్ బి.రాముకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

అనంతరం వారితో పట్టణంలోని పరిస్థితులపై చర్చించారు. పట్టణంలో పారిశుధ్యం, సదుపాయాలు మెరుగు పర్చేందుకు కృషి చేస్తానన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రికెట్ జిల్లా చాంపియన్‌గా 'తోటపేట'

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా పురుషుల క్రికెట్‌లో జిల్లా చాంపియన్స్‌గా రామచంద్రపురం మండలం తోటపేట గ్రామ సచివాలయ జట్టు గెలుపొందినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట వెంకటరామకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాజోలు నియోజకవర్గానికి చెందిన పొన్నమండ గ్రామ సచివాలయం–2 జట్టుపై 10 పరుగుల తేడాతో విజయం సాధించారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నూపుర్ అజయ్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నామన్నారు. తోటపేట జట్టును జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), గ్రామ సర్పంచ్ కోరపు కామరాజు, ఎంపీటీసీ అల్లం నాగసంధ్య, పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌వీ భాస్కరలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పెద్దలు అభినందించారు.



జేసీ నూపుర్ అజయ్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న తోటపేట జట్టు

తుది దశకు కులగణన

- క్లస్టర్ పరిధిలో 1.72 లక్షల కుటుంబాల్లో పూర్తి
- నేటితో ముగుస్తున్న గడువు
- వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి పూర్తి వివరాలు సేకరించే పని శరవేగంగా సాగుతోంది. ఇప్పటి వరకూ 1,72,685 కుటుంబాల్లో సర్వే పూర్తయ్యింది. క్లస్టర్ పరిధిలో ఇప్పటికే 90 శాతం కులగణన పూర్తయినట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి మిగిలిన కుటుంబాల్లో సర్వే పూర్తి చేస్తామంటున్నారు. బ్రిటిష్ హయాంలో 1931లో కులగణన జరిగిన తర్వాత ఇంత వరకూ ఏ ప్రభుత్వం నిర్వహించలేదు. వివిధ రకాల సర్వేలు, లెక్కలు చేసినప్పటికీ ఉప కులాలు, కులాల పేర్లతో గణన నిర్వహించలేదు. కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ ఇలా మాత్రమే గణన చేశారు. ప్రస్తుతం సమగ్ర కులగణన వివరాలను గ్రామ, వార్డు సిబ్బంది ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి ఇంటి డేటా యాప్‌లో ముందుగానే పొందుపర్చగా, ఆ వివరాల్లో మార్పులు ఉంటే సరి చేసుకుని కుటుంబ పెద్ద ఆమోదించాల్సి ఉంటుంది. మొదటి దశలో ఇల్లు, భూములు, ఇతర వివరాలు, రెండో దశలో కులం, ఉప కులం, మతం, ఇతర వివరాలను ధ్రువీకరిస్తున్నారు. 1951లో జనగణన చేసినప్పటికీ, కులగణన పూర్తి స్థాయిలో జరగలేదు.



కులగణన చేస్తున్న సిబ్బంది

ఎస్సీ, ఎస్టీలను మినహాయించి మిగిలిన గణన కులాల వారీగా చేపట్టలేదు. సుమారుగా 93 ఏళ్ల తర్వాత ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన చేపట్టేందుకు చారిత్రాత్మక, సాహసోపేత నిర్ణయంగా పలువురు పేర్కొంటున్నారు. కులగణన ద్వారా కులాలు, ఉప కులాల సంఖ్య తేటతెల్లమవుతుంది. కులగణన తర్వాత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవసరమైన ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించడానికి ఉపకరిస్తుంది. గణన పూర్తయ్యాక సచివాలయాల పరిధిలో 10 శాతం ఇళ్లలో రీ వెరిఫికేషన్ చేసి, గణన వివరాలను సరిపోల్చే అవకాశముంది.

లక్ష్యం మేరకు పూర్తి చేస్తాం



క్లస్టర్ పరిధిలో సమగ్ర కులగుణన శరవేగంగా సాగుతోంది. ఇప్పటి వరకూ 92.45 శాతం కుటుంబాలను సర్వే పూర్తి చేశాం. మిగిలిన కుటుంబాల్లోని సర్వేను ఆదివారం సాయంత్రానికి పూర్తి చేయాలని సూచించాం.

– ఎ.శాంతి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, రామచంద్రపురం

సచివాలయం యూనిట్‌గా..

సమగ్ర కులగణనను సచివాలయం యూనిట్‌గా చేసుకుని అందులో పనిచేసే ఉద్యోగులు, వలంటీర్లను ఎన్యూమరేటర్లుగా నియమించారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటుగా, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో 155 సచివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాలను 3,111 క్లస్టర్లగా విభజించారు. ఈ క్లస్టర్ల పరిధిలో 1,86,781 కుటుంబాలను సిబ్బంది సర్వే చేయాల్సి ఉండగా, శనివారం మధ్యాహ్నానికి 1,72,685 కుటుంబాల్లో సర్వే పూర్తి చేశారు. క్లస్టర్ పరిధిలోని 5,07,334 మంది వివరాలను కులగణనలో సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 4,49,374 మంది వివరాలను సేకరించారు. సమగ్ర కులగణన సర్వే ద్వారా ఏ కులాల వారు..ఎంత సంఖ్యలో ఉన్నారనేది గణాంకాలతో లెక్క పక్కాగా తేలనుంది.

విశాఖ వెళ్లి పింఛను అందజేత



వైజాగ్‌లో రోగికి పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఖండవిల్లి వీరాంజనేయులు, వలంటీర్ వాసంశెట్టి కృష్ణార్జున్ తమ పరిధిలోని లబ్ధిదారు వేపకాయల వీర్రాఘవులుకు శనివారం వైజాగ్ వెళ్ళి రూ. 3 వేలు వితంతు పింఛను అందజేశారు. లబ్ధిదారు అనారోగ్యంతో విశాఖపట్టణంలోని కింగ్ జార్జి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్లు ఆసుపత్రికి వెళ్ళి పింఛను సొమ్ము అందజేశారు. రోగికి సహాయకారిగా వెళ్లిన కోన భారతీదేవికి సైతం వితంతు పింఛను అందజేశారు. వారిని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి చినబాబు, సర్పంచ్ వాసంశెట్టి సునీత, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి విష్ణు అభినందించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



రామచంద్రపురం ఆసుపత్రిలో పింఛను అందజేస్తున్న నవీన్‌కుమార్

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ జి.నవీన్‌కుమార్ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన పరిధిలోని లబ్ధిదారు సఖిరెడ్డి బేబీకి శుక్రవారం వితంతు పింఛను అందజేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన లబ్ధిదారుకు పింఛను ఇవ్వడం పట్ల కార్యదర్శి రామకృష్ణ, సహచర ఉద్యోగులు నవీన్‌ను అభినందించారు.

సమాజాభివృద్ధిలో వైద్యుల పాత్ర ఎనలేనిది



గొల్లపాలెంలో పీహెచ్‌సీ వైద్యాధికారిని సన్మానిస్తున్న స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, స్థానికులు

కాజులూరు: సమాజాభివృద్ధిలో వైద్యుల ప్రాత ఎనలేనిదని వారిపై ప్రజలు ఎల్లప్పుడూ గౌరవ మర్యాదలు కలిగి ఉండాలని అలయన్స్ క్లబ్స్ జిల్లా వైస్ గవర్నర్ వనుం శ్రీనివాస్ అన్నారు. కాకినాడ అలయన్స్ క్లబ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శనివారం గొల్లపాలెం పీహెచ్‌సీలో జాతీయ మహిళా డాక్టర్స్ దినోత్సవం నిర్వహించి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో కదలి రాంపండు, యర్రంశెట్టి రామరాజు, డాక్టర్ శ్రావణి, టి.భార్గవి విజయవాహిని, సత్తిబాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

7న 'ఉపాధి' సామాజిక తనిఖీ వేదిక

రాయవరం: ఉపాధి హామీ పథకం రాయవరం మండల సోషల్ ఆడిట్ సమావేశాన్ని ఈ నెల 7న మండల పరిషత కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి శనివారం విలేకరులకు తెలిపారు.

ఉపాధ్యాయులకు సాంకేతికతతో విద్యాబోధన



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న వీరరాఘవరెడ్డి

రామచంద్రపురం: సాంకేతికతతో కూడిన విద్యాబోధనే విద్యా వ్యవస్థకు మేలు చేస్తుందని ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణా తరగతుల కోర్స్ డైరెక్టర్ వీర రాఘవరెడ్డి అన్నారు. మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి బోధించే భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీర రాఘవరెడ్డి కోర్స్ డైరెక్టర్‌గా సిమ్యులేషన్‌పై శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో పెట్ సిమ్యులేషన్, లాబ్ సిమ్యులేషన్, ఆన్‌లైన్‌లో నిర్వహించే విధానం, చాట్ జీపీటీ, జియో జీబ్రా, ఏఐటూల్, వివిధ రకాల ప్రయోగాలను ఏ విధంగా ఆన్‌లైన్‌లో నిర్వహించుకోవచ్చు అనే అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పరిశీలకులుగా ఐఆర్టీ కోఆర్డినేటర్ నారాయణ, రిసోర్స్ పర్సన్ పక్కి వీర బ్రహ్మానందం, కోడి ప్రసాద్, రామకృష్ణ, ఇనుమర్తి ప్రసాద్, గుంటముక్కల శ్రీనివాస్ వ్యవహరించారు.